

గోసంరక్షణ కోసం..

గోసంరక్షణ కోసం పాదయాత్ర చేయడం సంతోషంగా ఉందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. 12లో▸



పరిగిలో కల్తీ మటన్

ఆహారాన్ని కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రశాంత్ హెచ్చరించారు. 12లో▸



ప్రగతి పథంలో పల్లెలు

పంచాయతీ సర్పంచుల చొరవతో సంపూర్ణ పరిశుభ్రత కనిపిస్తోందని పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. 13లో▸

బదిలీలకు వేళాయే..

ప్రారంభమైన లోక్‌సభ ఎన్నికల కసరత్తు

- బదిలీలు చేపట్టాలని ఇప్పటికే సూచించిన కేంద్ర ఎన్నికల కమిషన్
- పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలే కీలకం
- మెజార్టీ జిల్లా అధికారులకు తప్పని స్థాన చలనం



వికారాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. బదిలీలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కలెక్టర్లు, ఎస్పీలకు ఇప్పటికే ఈ సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ, ఈవీఎంల పరిశీలన తదితర అంశాలపై ఇప్పటికే దృష్టి సారించిన అధికారులు, తాజాగా బదిలీల ప్రక్రియకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం శాఖల వారీగా ఎవరెవరిని ఇతర ప్రాంతాలకు పంపాలనే దానిపై జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని శాఖల్లో ఇప్పటికే జాబితా సిద్ధం కాగా మిగతా శాఖలు ఆ పనిలో నిమగ్నమయ్యాయి. గతంలో ఎన్నికలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ, పోలీసు శాఖల్లో మాత్రమే బదిలీ చేశారు. ఈ సారి ప్రత్యక్షంగా సంబంధం ఉండే వారితో పాటు ఆయా శాఖల హెచ్‌ఓడీలు (జిల్లా అధికారులు), పరోక్షంగా సంబంధం ఉండే ఎంపీడీఓలను సైతం బదిలీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీఓలు కలెక్టర్లను కోరగా సానుకూలంగా స్పందించి వారిని బదిలీ చేయలేదు. కానీ ఇప్పుడు మూడు సంవత్సరాలు పూర్తయిన వారందరినీ మార్చాలని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో పంచాయతీరాజ్ కమిషనర్ కూడా మూడేళ్లు పూర్తయిన అధికారులందరినీ మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసు, రెవెన్యూ శాఖల్లో మాత్రం ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే మార్చినందున ఈ ఎన్నికల నేపథ్యంలో ఒకరిద్దరు మినహా బదిలీలు ఉండక పోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

మెజార్టీ అధికారుల బదిలీలకు అవకాశం

ఈ సారి మండల, జిల్లా పరిషత్‌లలో మెజారిటీ అధికారులు బదిలీ కానున్నారు. కలెక్టర్, ఎస్పీతోపాటు అడిషనల్ కలెక్టర్లు, అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఆర్డీఓలు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగే అవకాశం ఉంది. వీరు జిల్లాకు వచ్చి మూడేళ్లు కాకపోవడమే కారణం. లూప్‌లైన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒకరిద్దరు తహసీల్దార్లు మాత్రమే బదిలీ కానున్నారు. మిగతా మండలాల తహసీల్దార్లందరూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన వారే కావడంతో వారెవరూ బదిలీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఇక మండల పరిషత్‌లలో మెజార్టీ ఎంపీడీఓలు బదిలీపై వెళ్లనున్నారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా 18 మండల పరిషత్‌లు ఉన్నాయి. ఇందులో నవాబుపేట ఎంపీడీఓ పదవీ విరమణకు దగ్గరలో ఉండటంతో ఆమెను బదిలీ నుంచి మినహాయించే అవకాశం ఉంది. ఇక యాలాల, బొంరాస్‌పేట, కొడంగల్ ఎంపీడీఓలు జిల్లాకు వచ్చి మూడేళ్లు కానందున వారిని కూడా బదిలీ నుంచి మినహాయించే అవకాశం ఉంది. వీరు మినహా మిగతా 14 మండలాల్లో రెండు మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండగా మిగతా 12 ఎంపీడీఓలు బదిలీ కానున్నారు. ఇక ఎంపీఈఓలను జిల్లా పరిధిలోనే బదిలీ చేయాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీఆర్డీఓ, అడిషనల్ డీఆర్డీఓ, డీపీఓ, వికారాబాద్ డీఎల్‌పీఓలు బదిలీ కావడం అనివార్యంగా కనిపిస్తోంది.

గతంలో బదిలీ కావాల్సి ఉన్నా..

జిల్లాస్థాయి మెజార్టీ అధికారులు మూడేళ్లకు మించి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ఇటీవలే మూడేళ్లు పూర్తి చేసుకోగా, మరికొందరు ఏడేళ్లు ఇక్కడే ఉంటున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో 90శాతం హెచ్‌ఓడీలు (ఆయా శాఖల జిల్లా బాస్‌లు) గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బదిలీ కావాల్సి ఉంది. అందరూ కొత్తవారే ఉంటే ఎన్నికలకు ఇబ్బందిగా మారుతుందనే భావనతో వారిని బదిలీ చేయలేదు. ప్రస్తుతం కొన్ని శాఖలకు చెందిన రాష్ట్ర హెచ్‌ఓడీలు మూడేళ్లు పూర్తయిన వారందరిని మార్చాలని పట్టుబడుతుండటంతో చేసేది లేక కలెక్టర్ కూడా ఆ శాఖలకు సంబంధించి మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారుల జాబితాను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. మిగతా శాఖలకు చెందిన రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి పెద్దగా ఒత్తిడి లేకపోవడంతో వారిని బదిలీ జాబితాలో చేరుస్తారా..? లేక ఎన్నికలు అయ్యే వరకు ఇక్కడే కొనసాగిస్తారా..? అనేది వేచి చూడాల్సి ఉంది.



సర్పంచులను సన్మానించిన సునీతారెడ్డి, నరేందర్‌రెడ్డి

సర్పంచుల సేవలు అమోఘం

- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

దౌల్తాబాద్: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎంతో కృషి చేశారని, వారి సేవలు మరువలేనివని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. గురువారంతో సర్పంచుల పదవీకాలం ముగియడంతో దౌల్తాబాద్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లపాటు గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎంతో శ్రమించారని కొనియాడారు. వారి సేవలు చిరకాలం నిలిచిపోతాయన్నారు. వారి పెండింగ్ బిల్లుల కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో మహిళలు పదవికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎంపీపీ, జెడ్పీటీసీలుగా పనిచేసిన వారు ఇప్పుడు ఎమ్మెల్యేలు, సీఎంలు అయ్యారని గుర్తు చేశారు. అనంతరం పంచాయతీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తిరుమల స్వామి, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసిన టీజేఎంయూ సభ్యులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, యూనియన్ నాయకులు

పరిగి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు, వేతన సవరణ చేపట్టాలని టీజేఎంయూ సభ్యులు గురువారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాక ముందే మాట నిలుపుకోవాలని కోరారు. ప్రభుత్వ ప్రకటన కోసం ఉద్యోగులు, సిబ్బంది ఎంతగానో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, నాయకులు శీనయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ విమల థామస్‌కు స్థల వివరాలను వివరిస్తున్న కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

స్థల నివేదికలు సమర్పించండి

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ
- ప్రభుత్వ వైద్య విద్య కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

కొడంగల్ రూరల్: అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి, అందుకు సంబంధించిన నివేదికలు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి, బొంరాస్‌పేట మండలం బొంరాస్‌పేట, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ భూములను టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ విమల థామస్, వైద్య విద్యా డైరెక్టర్ డాక్టర్ శివరామ్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రభుత్వ వైద్య విద్య కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించి వివరాలు అందజేయాలని సూచించారు. నివేదిక అందిన వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100పడకల ఆస్పత్రిగా విస్తరించేందుకు ఆస్పత్రి ఆవరణలోని స్థలాన్ని కిమ్స్ డైరెక్టర్ విమల థామస్ పరిశీలించారు. కార్యక్రమంలో కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, తహసీల్దార్ బి.విజయకుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ, డాక్టర్ సీహెచ్ వీణ, డాక్టర్ సాకేత్, బీసీ గురుకుల పాఠశాల రీజనల్ కోఆర్డినేట్ ఆఫీసర్ యాదయ్యగౌడ్, ప్రిన్సిపాల్ శంకర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- డీఈఓ రేణుకాదేవి

కొడంగల్ రూరల్: పదో తరగతి పరీక్షలకు కేవలం 40రోజుల వ్యవధి మాత్రమే ఉందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లోని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది ఉత్తీర్ణత శాతం తగ్గిందని, ప్రస్తుత పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సబ్జెక్ట్ టీచర్లు స్లిప్ టెస్టులు నిర్వహించి సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. వార్షిక పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమని అన్నారు. బట్టీ కొట్టకుండా సబ్జెక్టుపై పట్టు సాధించి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వార్షిక పరీక్షలంటే విద్యార్థులకు భయాందోళన ఉంటుందని, దాన్ని తొలగించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

'ఫేషియల్'తో అక్రమాలకు చెక్

- ఉపాధి హామీ కూలీలకు ఫేషియల్ అటెండెన్స్
- ఏప్రిల్ నుంచి అమలయ్యే అవకాశం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వికారాబాద్ అర్బన్: ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కూలీల అక్రమ హాజరుకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ నుంచి ఫేషియల్ అటెండెన్స్ అమలు చేయాలని నిర్ణయించింది.ఇప్పటికే ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా పని చేస్తున్న చోట కూలీల ఫొటోలతో అటెండెన్స్ వేస్తున్నారు. ఈ విధానంతో తప్పుడు హాజరును అరికట్టవచ్చు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరగకుండా అనేక సంస్కరణలు తీసుకొస్తున్నా ఎక్కడో ఒక చోట తప్పులు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా బోగస్ కూలీలకు పూర్తి చెక్ పెట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను రూపొందించింది. ప్రస్తు తం ఈ యాప్‌తో పని జరుగుతున్న చోట కూలీలను గుంపుగా ఫొటో తీసి అటెండెన్స్ వేస్తున్నారు. అలా కాకుండా ఒక్కో కూలి ఫొటో తీసి ఫేషియల్ అటెండెన్స్ వేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీని పనితీరును క్షేత్రస్థాయిలో అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఇది విజయవంతమైతే ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది.

అటెండ్ అయితేనే హాజరు

ప్రస్తుతం అమలవుతున్న ఎన్‌ఎంఎంఎస్ విధానంతో కూలీ వ్యక్తి గత ఫొటో తీయడం లేదు. గుంపుగా ఫొటో తీసి హాజరైనవారి పేర్లపై అటెండెన్స్ వేస్తున్నారు. ఇక్కడ గుంపు ఫొటోలో కూలీ లేకపోయినా అటెండెన్స్ వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి తప్పులు జరగకుండా ఫేషియల్ అటెండెన్స్‌ను తీసుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఉపాధి కూలీల వివరాలు ఆధార్ కార్డులతో అనుసంధానం చేశారు. కొత్త పద్ధతిలో ఆధార్ సర్వర్‌తో అనుసంధానమైన ఎన్‌ఎంఎంఎస్ ప్రత్యేక యాప్‌లో కూలీల ముఖాన్ని ఫొటో తీయాల్సి ఉంటుంది. ఈ ఫొటో ఆధార్‌లో ఉన్న ఫొటోతో జత కలిస్తేనే కూలీలకు హాజరు పడుతుంది. కూలీల వివరాలను ఫీల్డ్ అసిసెంట్లు ఆ యాప్‌లో ముందుగానే నమోదు చేసుకుంటారు. ఈ విధానం బాగానే ఉన్నా క్షేత్ర స్థాయిలో సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నా యని అధికారులు అంటున్నారు. ఫేషియల్ అటెండెన్స్ వేసేందుకు ఒక్కో కూలీకి 5 నుండి 8 నిమిషాల సమయం తీసుకునే అవకాశం లేకపోలేదని అంటున్నారు.

నెట్‌వర్క్ ఇబ్బందులు

జిల్లాలో అధికంగా మారుమూల గ్రామాలు ఉండటంతో నెట్‌వర్క్ సమస్య ఉంటుంది. ఉపాధి హామీ పనులు మారుమూల గ్రామాలు, అడవుల్లో, నివాసాలకు దూరంగా జరుగుతుంటాయి. అక్కడ ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగ్గా ఉండదు. చాలా గ్రామాల్లో సెల్ ఫోన్లకే నెట్‌వర్క్ అందని పరిస్థితి ఉంటుంది. అలాంటిది పనిచేసే చోట ఫేషియల్ అటెండెన్స్ వేయడం సాధ్యం అవుతుందా? కాదా? అనే దానిపై అనుమానాలు ఉన్నాయి. ఫేషియల్ రికగ్నైజేషన్ యాప్ అమల్లోకి వస్తే పారదర్శకత నెలకొనడంతో పాటు చిక్కులు సైతం ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జాబ్ కార్డులు ఉన్న కూలీలు 3,70,672 మంది ఉన్నారు. వీరందరికీ వ్యక్తిగతంగా ఫొటో తీయాల్సి ఉంటుంది.

నెట్‌వర్క్ సమస్య కావచ్చు



ప్రస్తుతం కూలీల హాజరుకు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఫొటో తీసి ఒక్కో కూలీ అటెండెన్స్ వేస్తున్నాం. ఈ రకమైన హాజరు వేయడానికి పెద్దగా ఇబ్బందులు ఏమీ లేవు. ఫేషియల్ అటెండెన్స్ వేయాల్సి వస్తే సమయం ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంది. నెట్‌వర్క్ సమస్య కూడా ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. ఫేషియల్ అటెండెన్స్ అమలు చేస్తే క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– కృష్ణన్, డీఆర్‌డీఓ

కందులకు రికార్డు స్థాయి ధర

క్వింటాలుకు గరిష్ట ధర రూ.10,551

తాండూరు: కందుల ధర రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ సారి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో డిమాండ్ పెరిగింది. పక్షం రోజుల క్రితం వరకు తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాలు కందులకు రూ. 8,500 నుంచి రూ.9,500 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.10 వేల పైమాటే. ఎన్నడూ లేని విధంగా గురువారం మార్కెట్ యార్డులో జరిగిన ఈనామ్ బిడ్డింగ్‌లో క్వింటాలు కందులకు రూ.10,551 ధర పలికింది. జిల్లాలోనే తాండూరు ప్రాంతంలో కంది పంటను అధికంగా సాగు చేస్తారు. ఇక్కడి కందులకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. రెండేళ్ల క్రితం తాండూరు కందిపప్పుకు కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ఇచ్చింది. ఈ సారి యార్డుకు ఆశించిన స్థాయిలో పంట ఉత్పత్తులు రాకపోవడంతో ధరలు పెరిగాయి. గతేడాది తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 1.77 లక్షల క్వింటాళ్ల కందుల కొనుగోళ్లు జరిగాయి. ఈ ఏడాది కేవలం 50 వేల క్వింటాళ్ల కందులను కొనుగోళ్లు జరిగాయి.



తాండూరు మార్కెట్‌లో కందుల బస్తాలు

కందిపప్పు ధరలకు రెక్కలు

మార్కెట్‌లో కందిపప్పు ధరలకు రెక్కలొచ్చాయి. దాల్ మిల్లుల్లోనే క్వింటాలుకు రూ.15,500 వరకు ధర పలకడం గమనార్హం. ఈ ఏడాది కింటాలు కందిపప్పు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఉండవచ్చని వ్యాపారులు అంటున్నారు.

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగ విద్యార్థుల నుంచి 2023 –24 ఆర్థిక సంవత్సరానికి ప్రి మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దివ్యాంగుల విద్యార్థుల వివరాలతో httpr.teanfanae parr.cff.gov.inలో లాగిన్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9502912981లో సంప్రదించాలన్నారు.

కంది పంట పరిశీలన



సంగెంకలాన్‌లో కంది పంటను పరిశీలిస్తున్న గోపాల్

తాండూరు రూరల్: వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. గురువారం మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రైతు బంధు నగదు అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ, ఏఈఓలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్



కాలుష్య నియంత్రణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవాబుపేట: కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ అన్నారు. యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మమ్మదంపల్లి, వికారాబాద్ మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలల్లో పర్యావరణ సమతుల్యత, కాలుష్య కోరల నుంచి భూమిని కాపాడుకోవడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. జీవ సమ తుల్యతను కాపాడటంలో చెట్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్ని పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఎస్పీ కోటిరెడ్డి
- ఆపరేషన్ స్మైల్‌తో 162 మంది బాలకార్మికులకు విముక్తి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం నిర్వహించి 162మంది బాలకార్మికులకు విముక్తి కల్పించాలని తెలిపారు. పిల్లలను కాపాడటం చాలా గొప్ప విషయమన్నారు. పిల్లలతో భిక్షాటన చేయించినా, పరిశ్రమల్లో పనులకు పెట్టుకున్నా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లలను పనుల్లో పెట్టుకున్న 11మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లా కార్మిక శాఖ అధికారి శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, సీసీఎస్ సీఐ బాలస్వామి, ఐటీసీటీ సీఐ రవికుమార్, డీఎస్‌బీ సీఐ డీవీపీ రాజు, చైల్డ్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది నరేష్‌కుమార్, ఆంజనేయులు, షఫీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు ఆనంద్, మహేష్, కార్మిక శాఖ సిబ్బంది వినాయక రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గడపగడపకూ గోవు, గోవిందుడు, గీత అనే నినాదంలో లక్ష్య సాధన ఫౌండేషన్‌ వారు నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్ర గురువారం పరిగికి చేరుకుంది. పట్టణ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, ఆలయ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన నియామకం



సాయిబాబ

కుల్కచర్ల: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ జిల్లా అడ్వయిజరీ మెంబర్‌గా కుల్కచర్ల గ్రామానికి మాలె సాయిబాబ గౌడ్‌ నియమితులైయ్యారు. గత కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాల్లో వివిధ జిల్లాలో క్రీయాశీలకంగా వ్యవహరించారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ జిల్లా యువకేంద్ర సంఘటన్‌ అడ్వయిజరీ మెంబర్‌గా ఎంపిక చేసింది. సాయిబాబ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ ఇవ్వడంపై ఉంచి యువతలో మార్పును తీసుకువచ్చి వారిలో దేశభక్తిని పెంపొందించడంతో పాటుగా గ్రామీణ క్రీడాకారులకు క్రీడాపరికరాలు అందించేందుకు కృషి చేసే అవకాశాన్ని కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

కార్మికురాలు లక్ష్మికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

కొడంగల్‌ రూరల్‌ : పారిశుద్ధ్య కార్మికురాలు లక్ష్మి అవార్డుకు ఎంపికైన సందర్భంగా గ్రామ సర్పంచ్‌ పకీరప్ప ఆమెను గురువారం సన్మానించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి వచ్చిన ఆమెకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. లక్ష్మి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలుగా ఎంపికవడం ఆనందంగా ఉందని, గ్రామపేరును దేశస్థాయిలో నిలపడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కోరిన ఎమ్మెల్యే బీఎంఆర్‌



కేంద్ర మంత్రితో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు ఆర్‌అండ్‌బీ రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీని కోరారు. గురువారం ఆయన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి పనులపై కేంద్ర ప్రభుత్వ అధికారులతో మంత్రులు సమావేశమయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 5వేల కోట్లతో రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని కేంద్రమంత్రి వారికి సూచించినట్లు చెప్పారు. తమ ప్రాంతంలో నాపరాయి నిక్షేపాలు ఉన్నాయని, ఇతర ప్రాంతాలకు పెద్ద ఎత్తున సిమెంట్‌ రవాణా చేస్తుంటారని ఎమ్మెల్యే కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. జిల్లాలోని మన్నెగూడ నుంచి తాండూరు మీదుగా ముంబై జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. అంతేకాకుండా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌ నుంచి బషీరాబాద్‌ మీదుగా కర్ణాటక సరిహద్దులోని రహదారిని కలిపేలా చూడాలని విన్నవించారు. గతంలో జడ్చర్ల నుంచి తాండూరు మీదుగా మన్నెకెల్లి వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులను కేంద్ర మంత్రికి వివరించారు. ఇందుకు నితిన్‌గడ్కరి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర మంత్రులు తెలిపారు.

గోసంరక్షణ కోసం పాదయాత్ర

కుల్కచర్ల: గోసంరక్షణలో కోసం పాదయాత్ర నిర్వహించడం ఎంతో అభినందనీయమని కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్‌, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. వంశీకార్తీక్‌, చెన్నయ్య గురుస్వాముల నేతృత్వంలో గురువారం మండల కేంద్రంలో అఖిల భారత హిందూ సమాజం ఆధ్వర్యంలో గోవు మహాపాదయాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాచీనకాలంలో సేంద్రియ వ్యవసాయం చేసే వారు కావునా.. వారు ఆరోగ్యంగా ఉండే వారన్నారు. ముఖ్యంగా ఆవుల నుంచి చిన్నారులకు ఆరోగ్యకరమైన పాలు లభించేవని తెలిపారు. పేడతో సేంద్రియ వ్యవసాయం చేసుకోవడంతో పాటుగా పిడకలు చేసి వివిధ అవసరాలకు ఉపయోగించేవారని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేయకపోవడం వల్ల కెమికల్స్‌ రూపంలో మనం కూడా విషపూరితమైన ఆహారాన్ని తినే పరిస్థితి దాపురించిందన్నారు. అనంతరం కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. గోవులను పెంచుకోవడం వల్ల ఎంతో ఉపయోగమని అలాగే, గోవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యతని వివరించారు. అలాగే, మండల పరిధిలోని ఘనపూర్‌ గ్రామంలోని శివసాయి దేవస్థానంలో ఏర్పాటు చేసిన రామలింగేశ్వర గోశాలలో శివస్వాములు గోసంరక్షణ కమిటీ సభ్యులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్యగురుస్వామి, బస్వరాజు, రఘు, పెంటయ్య, నందీష్‌, రాజు, శ్రవణ్‌ గురుస్వాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కేఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ, పీఎస్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్‌, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్‌, ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్‌, కేశవులు, అంజనేయులు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములు

వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న వెటర్నరీ ఏడీ డాక్టర్‌ నోవా

వెటర్నరీ ఏడీ డాక్టర్‌ నోవా

కొడంగల్‌ రూరల్‌ : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వెటర్నరీ ఏడీ డాక్టర్‌ నోవా అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలలో వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో వన్యప్రాణులు కనుమరుగవుతున్నాయని, వాటిని జూ పార్కుల్లో చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పక్షుల కోసం ఇంటిపై నీటిని పెడుతూ సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మూగ జీవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు విద్యార్థుల ఆట వస్తువుల కొనుగోలుకు రూ.5వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, వెటర్నరీ డాక్టర్లు రియాజ్‌ అహ్మద్‌, పరమేష్‌, సిబ్బంది వెంకటయ్య, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంపై కేసీఆర్‌ కుట్ర

టీజేఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్‌



తాండూరు టౌన్‌ : తెలంగాణ ఉద్యమనేత ప్రొఫెసర్‌ కోదండరాంపై మాజీ సీఎం కేసీఆర్‌ చేస్తున్న కుట్ర బట్టబయలైందని తెలంగాణ జన సమితి తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, కౌన్సిలర్‌ సోమశేఖర్‌ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడిని చట్టసభలోకి అడుగు పెట్టకుండా ముందస్తు ప్రణాళికతోనే కేసీఆర్‌ కోర్టులో కేసు వేయించి, కోదండరాం ఎమ్మెల్సీ ప్రమాణస్వీకరాన్ని వాయిదా వేయించాడన్నారు. గతంలో సైతం గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేసీఆర్‌ వందల కోట్లు ఖర్చు పెట్టి కోదండరాంను ఓడించారని ఆరోపించారు. ఇప్పుడు కూడా ఏకంగా కోర్టునే తప్పుదోవ పట్టించే యత్నం కేసీఆర్‌ చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ నీచ రాజకీయాలను నిరసిస్తూ తెలంగాణ జన సమితి కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామ్య వాదులు నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కోదండరాంను చట్ట సభలోకి పంపడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వేరుశనగ సేకరణకు కూలీల కొరత



వేరుశనగ సేకరిస్తున్న కూలీలు

ధారూరు: మండలంలో దాదాపు 5 వేల ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగు చేశారు. పంట సకాలంలో సేకరించి, మద్దతు ధర పొందాలని రైతులు కూలీల కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో రోజువారి కూలీ రూ.200 నుంచి రూ.300 ఉంది. ప్రస్తుతం రోజుకు రూ. 500 నుంచి రూ. 600 వరకు ఇస్తేనే పనికి వస్తామని రైతులు వాపోతున్నారు. వేరుశనగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 7,200 నుంచి 7,450 వరకు ధర పలుతుంది. ఆలస్యం చేసే కొద్దీ ధర తగ్గిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా తొందరగా సేకరించి ఆరబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

హన్మన్‌గండి సమీపంలో ఘటన



సాయితేజ (ఫైల్‌)



శివ (ఫైల్‌)

పరిగి: ఆటో, బైక్‌ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హన్మన్‌గండి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పొల్కపల్లి గ్రామానికి చెందిన సాయితేజ(21) నగరంలో బీటెక్‌ చదువుతున్నాడు.. గురువారం నగరం నుంచి పరిగికి వచ్చాడు. దీంతో అతని స్నేహితులు శివ(22), సాయికుమార్‌లు బైక్‌పై పరిగికి వెళ్లి బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా మార్గమధ్యలో హన్మన్‌గండీ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సాయితేజ, శివకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సాయికుమార్‌కు గాయాలు కావడంతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చేతికి వచ్చిన కుమారులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



వాల్‌పోస్టర్‌ విడుదల చేస్తున్న నాయకులు

అనంతగిరి: సెంట్రల్‌ స్కీంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ సర్వీసును క్రమబద్ధీకరించి ఏఎన్‌ఎం, ఆశవర్కర్లలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మై పాల్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం మె డికల్‌ హెల్త్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారికి వినతి పత్రంతో పాటు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16న దేశభక్తి గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. పీఆర్‌సీ ఎరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని అన్నారు. వాక్సిన్‌, యూనిఫాం అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం దేశభక్తి గ్రామీణ బందు వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు లీలావతి, లలిత, వెంకటమ్మ, జంగమ్మ, అనురాధ, అనంతలక్ష్మి, అనిత, పాపమ్మ, రాములమ్మ, సులోచన, మంగమ్మ, పద్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

పూడూరు: మైనర్‌ మృతికి కారణమైన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదయింది. ఈ ఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మన్నేగూడకు చెందిన ఎర్ర అండాలు, బాలయ్య దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. రెండవ కుమార్తెను మండల పరిధిలోని గొంగుపల్లికి చెందిన ఎర్రోళ్ల వెంకటేశ్‌ ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నెల 30న భర్త వెంకటేశ్‌కు భోజనం వడ్డించే విషయంలో మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వికారాబాద్‌ మిషన్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 31న బుధవారం మృతి చెంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై ప్రోక్సో చట్టంతో పాటు , చైల్డ్‌ మ్యారేజ్‌ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

పరిగిలో కల్తీ మటన్‌

వ్యాపారిపై కేసు నమోదు



పోలీసుల సోదాలో బయటపడిన కల్తీ మటన్‌

పరిగి: ప్రజలు తినే ఆహారాన్ని కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్‌ ఎస్సై ప్రశాంత్‌లు హెచ్చరించారు. గురువారం పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌ కాలనీలో ఓ మటన్‌ వ్యాపారి కల్తీ మటన్‌ విక్రయిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందడంతో తనిఖీ నిర్వహించారు. కాలనీకి చెందిన ఖలీల్‌ ఇంట్లో టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది, పోలీసుల తనిఖీ చేయగా 20రోజుల క్రితం కట్‌ చేసిన 70కిలోల కల్తీ మటన్‌ లభ్యమైంది. ఫ్రీజ్‌లో ఉంచుకుని విక్రయించే సమయంలో వెనిగర్‌ నీళ్లలో ముంచి అమ్ముతున్నట్లు వ్యాపారి పోలీసులకు తెలిపాడు. వెనిగర్‌ నీళ్లల్లో ముంచడం ద్వారా మటన్‌ అప్పుడే కోసిన మటన్‌గా ఫ్రెష్‌గా ఉంటుందని చెప్పారు. కల్తీమటన్‌ను సీజ్‌ చేసి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రజలు కల్తీ ఆహార పదార్థాలపై అవగాహన ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే పోలీసులు సమాచారం అందించాలని సూచించారు. కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపల్‌ కౌన్సిలర్‌ ఆఫీసులో చోరీ

కంప్యూటర్‌, ప్రింటర్‌లతో పాటు దస్తావేజులను ఎత్తుకెళ్లిన దుండగులు



కౌన్సిలర్‌ కార్యాలయం

తాండూరు: తాండూరు మున్సిపల్‌ 21వ వార్డు కౌన్సిలర్‌ సల్మా ఫాతిమా కార్యాలయంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం కొందరు దుండగులు కౌన్సిలర్‌ ఆఫీసులోకి చొరబడి, ఆఫీసులోని కంప్యూటర్‌ ప్రింటర్‌తో పాటు దస్తావేజులు, ఓటర్లకు చెందిన పత్రాలు అన్ని ఎత్తుకెళ్లారు. టేబుల్‌ డ్రాలో ఉన్న రూ.లక్ష నగదును కూడా తీసుకెళ్లారని మాజీ కౌన్సిలర్‌ జుబేర్‌లాల తెలిపారు. ఆఫీసులో ఉన్న మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్‌ నాయకుల ఫొటోలను సైతం వదలకుండా ఎత్తుకెళ్లారని అన్నారు. ఈ విషయమై తాండూరు పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

యువకుడి ఆత్మహత్య



రమేష్‌ మృతదేహం

మర్పల్లి: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఘణాపూర్‌ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి రమేశ్‌ (36) కర్ణాటక రాష్ట్రం శివరాంపూర్‌ గ్రామానికి చెందిన జ్యోతిని గత 5 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆటో నడుపుకుంటూ జీవించేవారు. ఇటీవల భార్య జ్యోతిని ప్రసవం కోసం పుట్టింటికి పంపాడు. మంగళవారం రాత్రి తల్లితో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. బుధవారం ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవడంతో గదిలోకి వెళ్లి చూడగానే రమేశ్‌ దులానికి ఉరేసుకొని విగత జీవిగా వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న మర్పల్లి పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్‌: మండలంలోని వీర్‌శెట్టిపల్లి గ్రామశివారులో ఉన్న కాగ్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరారు. గురువారం తాండూరు రూరల్‌ సీఐ అశోక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీర్‌శెట్టిపల్లి వాగు నుంచి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. పక్కనే ఉన్న అగ్గనూర్‌ గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని చెప్పారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు నాగప్ప, మాజీ సర్పంచు నర్సింలు, నాయకులు నర్సింలు ఉన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పరిగి: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హన తండాలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. హరిశ్చందర్‌(45) తన పొలంతో పాటు 5ఎకరాలు కౌలుకు తీసుకుని పంటసాగు చేశాడు. పంట సక్రమంగా పండక దిగుబడి తగ్గింది. దీంతో దాదాపుగా రూ.6లక్షల అప్పు చేశారు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గదుల పునర్నిర్మాణం చేపట్టాలి



వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని బాలాజీనగర్‌ సీపీఎస్‌ పాఠశాల గదుల పునర్నిర్మాణం చేపట్టాలని కోరుతూ కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి గురువారం హెచ్‌ఎం పరమేశ్వరమ్మ వినతిపత్రం అందజేశారు. పాఠశాల గదులు శిథిలావస్థకు చేరడంతో ఇక్కడి విద్యార్థులకు మరో పాఠశాలలో బోధన అందిస్తున్నామన్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని పేర్కొన్నారు. తరగతి గదుల పునర్నిర్మాణం చేపట్టి, పాఠశాల కొనసాగేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుహాసిని, దీపిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు టిప్పర్‌ అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఘణాపూర్‌ గేటు దగ్గర ఉన్న కంకరను తీసుకెళ్లేందుకు నంచర్ల నుంచి వస్తుండగా అంతారం సమీపంలో టిప్పర్‌ అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. వాగులో నీరులేకపోవడం, వెంటనే డ్రైవర్‌ అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ప్రమాదం తప్పింది. ఘణపూర్‌ గేటు పరిధిలో ఏర్పాటు చేసిన క్రషర్ల వద్ద మోతాదుకు మించి కంకర, డస్టును తీసుకువెళ్తున్న వాహనాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.